క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం

గూడూరు రూరల్ : భారీ వర్షాలకు గూడూరు పట్టణంలోని వరదానగర్ గిరిజన కాలనీలో ఇళ్లు కోల్పోయిన వారికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆర్థిక సాయం అందించారు. ఆయన బుధవారం వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. గిరిజన కాలనీలో ఐదుగురి పూరిళ్లు కూలిపోవడంతో ఒక్కొక్కరికి రూ.5 వేలు సాయం అందించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాండ్ర నారాయణరెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, గోపీ యాదవ్, అశోక్‌రెడ్డి, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో విత్తనాలు

కోట: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటలు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు అందజేస్తామని తెలిపారు. రైతులు ఆర్బీకేలో సంప్రదించి దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఏవో నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి



చిల్లకూరు : మండలంలోని కమ్మవారిపాళెంలో బుధవారం జ్వరంతో బాలిక మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన కలిచేటి వెంకటమ్మ కుమార్తె దినీషా(14) కడివేడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. భారీ వర్షాల వల్ల కుటుంబ సభ్యులు చిన్నారికి వైద్యం అందించలేకపోయారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది. ఈ విషయంపై చిల్లకూరు వైద్యులు అరాఫత్‌ను వివరణ కోరగా చిన్నారి మృతి విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

వాహనదారులకు భోజనాలు



నాయుడుపేట టౌన్ : భారీ వర్షాల కారణంగా కాళంగా నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో సూళ్లూరుపేట సమీపంలో జాతీయ రహదారి దెబ్బతినింది. దీంతో నాయుడుపేట నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను నిలిపివేశారు. రహదారిపై హోటళ్లు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, పీఎంఆర్ ఎర్త్ మూవర్స్ అధినేత పోచారెడ్డి మహేష్ రెడ్డి వారికి భోజనాలు అందజేశారు.

విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం

కోట: తుపాను ప్రభావంతో కోట మండలంలో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు ఏపీ ఎస్పీ డీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. ఆయన బుధవారం కోట మండలంలో పర్యటించారు. సిద్ధవరంలో వరద తాకిడికి గురైన సబ్ స్టేషన్‌ను, ఉత్తమ నెల్లూరు సమీపంలో నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. మండలంలో 220 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, 50 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదాలు జరగలేదన్నారు. ఏడీ వరప్రసాద్‌రావు, ఏఈఈ మునీంద్ర పాల్గొన్నారు.

పంటల పరిశీలన

దొరవారిసత్రం : మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ 4000 వేల ఎకరాల్లోని పంటలు నీట మునిగాయని తెలిపారు. పంటలను రక్షించుకునేందుకు ఎకరాకు 20 కిలోలు యూరియా, 20 కిలోల ఎంవోపీ వేసుకోవాలని సూచించారు. తెగుళ్లు రాకుండా లీటరు నీటికి గ్రాము కార్బండిజం కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు



గూడూరు రైల్వే స్టేషన్‌లో సెల్ ఫోన్లకు చార్జింగ్ పెట్టుకుంటున్న యువకులు

గూడూరు రూరల్ : వర్షం ఆగిపోయి బుధవారం ఎండ కాయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో వరద నీరు పూర్తిగా తగ్గిపోవడంతో బస్సుల రాకపోకలు కొనసాగాయి. చల్లకాలువ, పంబలేరు, కై వల్యా నది నీటి ప్రవాహం తగ్గింది. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల పునరుద్ధరణ కాకపోవడంతో విద్యుత్ సరఫరా జరగలేదు. సెల్ ఫోన్ల ఛార్జింగ్ కోసం ప్రజలు రైల్వే స్టేషన్‌కు పరుగులు తీశారు.

చేనేత మగ్గాల పరిశీలన

వెంకటగిరి(సైదాపురం) : భారీ వర్షాలకు వెంకటగిరిలో దెబ్బతిన్న చేనేత మగ్గాలను మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. వెంకటగిరిలో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారి సమస్యలను వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జలదిగ్బంధంలోనే గ్రామాలు

- ఎటు చూసినా వరద నీరే
- తీరప్రాంత గ్రామాలకు రాకపోకలు బంద్



సైదాపురం: నీట మునిగిన పంట పొలాలు



బాలిరెడ్డిపాళెం వద్ద కోతకు గురైన స్వర్ణముఖినది కరకట్ట

చిల్లకూరు : భారీ వర్షాల కారణంగా వరద నీరు ముంచెత్తడంతో మండలంలోని పలు గ్రామాలు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం లేక, తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై పెద్ద పెద్ద చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి బకింగ్ హాం కెనాల్‌కు ఆవలి వైపున ఉన్న వారి వద్దకు చేరుకుని మాట్లాడారు. వారికి నిత్యావసర వస్తువులతోపాటు తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటసూర్యసాయిని ఆదేశించారు. అదేవిధంగా ఉప్పటేరు పొంగి పారుతుండడంతో తిప్పగుంటపాళెం, చేడిమాల, పారిచెర్లవారిపాళెం, నల్యాలగారిపాళెం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తేరుకుంటున్న గ్రామాలు

వాకాడు : భారీ వర్షాలతో ఇబ్బంది పడిన ప్రజలు తేరుకుంటున్నారు. బాలిరెడ్డిపాళెం-గంగన్నపాళెం గ్రామాల మధ్య స్వర్ణముఖి నది కరకట్ట బుధవారం తెగిపోవడంతో 165 ఇళ్లు నీట మునిగాయి. అలాగే 3 సిమెంటు శ్లాబు ఇళ్లు వరదలో కొట్టుకుపోయాయి. ముట్టెంబాక వద్ద పిట్టివానిపల్లి రోడ్డుకు గండిపడింది. వాకాడు-చిట్టమూరు మధ్య వాకాడు చెరువు కలుజు పారడం, మరోచోట వరద పొంగి పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

అంధకారంలో డీవీ సత్రం

దొరవారిసత్రం : భారీ వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడంతో దొరవారిసత్రం, తల్లంపాడు, పూలతోట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదిన పనులు చేస్తున్నారు. సూళ్లూరుపేట నుంచి కారికాడుకు వెళ్లే రోడ్డుకు మీజూరు సమీపంలో భారీ గండి పడింది. దీంతో మండలంలోని కారికాడు, వేలికాడు, మీజూరు, నాగినేరి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వరద నీటి ప్రవాహం తగ్గిన వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేస్తామని ఆర్అండ్‌బీ డీఈ పరమేశ్వరి తెలిపారు.

స్వర్ణముఖి నదిలో తగ్గిన ప్రవాహం

నాయుడుపేట టౌన్ : స్వర్ణముఖి నదిలో బుధవారం నాటికి వరద ఉద్ధృతి కొంతమేర తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరే అవకాశం ఉండడంతో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది నది వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. నాయుడుపేట, మేనకూరు, వెంకటగిరి వైపు ఆర్టీసీ, పరిశ్రమల బస్సులు, వాహనాలు కాజ్‌వేపై రాకపోకలు సాగిస్తున్నాయి.

చెరువుకట్టలకు మరమ్మతులు

భారీ వర్షాలకు డివిజన్‌లోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని చెరువులకు సమృద్ధిగా నీరు చేరిందని ఇరిగేషన్ డీఈ కోటేశ్వరావు బుధవారం తెలిపారు. 50కు పైగా చెరువుకట్టలు బలహీనంగా ఉండడంతో బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

190 ఎకరాల్లో పంట నష్టం

వెంకటగిరి రూరల్ : భారీ వర్షాలకు మండలంలోని జీకేపల్లి, కళవలపూడి, ఉప్పరపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను బుధవారం తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు జాన్, పి.లత, పి.హారతి, ఏడీఏ నాగార్జునసాగర్ పరిశీలించారు. మండలంలో 190 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, 40 ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్టు పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని యాతలూరు పెద్ద చెరువుకు నీరు చేరింది. నీటి ఉద్ధృతి పెరగడంతో కట్టకు గండి పడి సమీపంలో ఉన్న యర్రగుంట చెరువులోకి నీరు చేరింది. దీంతో ఆ చెరువు కట్టకు గండి పడి నీరు యాతలూరు వ్యవసాయ పొలాల్లో ప్రవహిస్తోంది. సుమారు 150 ఎకరాల్లో పంట నష్టమైందని రైతులు వాపోతున్నారు. స్థానికులు జేసీబీతో చెరువు కట్టలకు మరమ్మతు పనులు చేపట్టారు.

కోతకు గురైన బ్రిడ్జి

దక్కిలి: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దక్కిలి పంచాయతీ అత్తల సిద్ధవరం ఎస్టీ కాలనీకి వెళ్లే బ్రిడ్జి కూలిపోయింది. పీఆర్ డీఈఈ లక్ష్మీనారాయణ, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రసన్నకుమారి బుధవారం బ్రిడ్జిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ వెలుగొండ కొండలు నుంచి నీరు ఎక్కువగా వస్తోందని, వరద ఉద్ధృతి తగ్గిన తరువాత చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్తల సిద్ధవరం నుంచి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. నీటి ప్రవాహాన్ని ఎవ్వరూ దాటవద్దని సూచించారు.

మల్లాం చెరువుకు గండి

చిట్టమూరు : భారీ వర్షాలకు మల్లాం చెరువు నిండింది. కట్ట బలహీనంగా ఉండడంతో బుధవారం గండి పడింది. చెరువులో నీరు వృథాగా పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకుని ఇసుక బస్తాలతో గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



బోటు ద్వారా ముంపు గ్రామాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వాకాడు : భారీ వర్షాలకు మండలంలో ముంపునకు గురైన గ్రామాల్లో బుధవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పర్యటించారు. బోటు ద్వారా బాలిరెడ్డిపాళెం వద్ద తెగిన స్వర్ణముఖి నది కరకట్టను పరిశీలించారు. బండ్ల దిబ్బ హరిజనవాడలో పర్యటించి నష్టం వివరాలు తెలుసుకున్నారు. వరదలో కొట్టుకుపోయిన పక్కా గృహాలకు సహాయం అందేలా చూస్తానని బాధితులకు ధైర్యం చెప్పారు. బాలిరెడ్డిపాళెం వద్ద వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, వాకాటి జనార్దన్‌రెడ్డి, వాకాటి రవి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో గోపీనాథ్, ఇరిగేషన్ డీఈ సుబ్బారావు, సీఐ హరికృష్ణ, ఎస్ఐ రఘునాథ్ ఉన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు చిల్లకూరు మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామానికి పడవలో చేరుకుని స్థానికులతో మాట్లాడారు. నిత్యావసర వస్తువులతో పాటు పరిహారం అందించేలా జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తామని అన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, నాయకులు యల్లంటి వేణురెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెరువులకు జల కళ



నీటితో నిండిన రాపూరు దాబలచెరువు

రాపూరు: భారీవర్షాలతో మండలంలోని పలు చెరువులు జల కళను సంతరించుకున్నాయి. మండలంలో 4 చెరువులు మినహా అన్నీ నిండినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. కొండేరు ఉద్ధృతికి పంగిలి గ్రామానికి వెళ్లే రోడ్డు దెబ్బతినింది. పలుచోట్ల నిమ్మచెట్లు నేలకొరిగాయి. 110 ఎకరాల్లో మిరప, 180 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో మినుము పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు.

తగ్గని కైవల్యా నది ప్రవాహం



సైదాపురం:ఉధృతంగా ప్రవహిస్తున్న కైవల్యానది

సైదాపురం: భారీ వర్షాలతో కైవల్యా నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మూడో రోజూ ప్రవాహం తగ్గలేదు. దీంతో బుధవారం కూడా సైదాపురం-గూడూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మాలేరు వాగు ప్రవాహంతో సైదాపురం-పొదలకూరు రోడ్డులో రాకపోకలు సాగలేదు. సైదాపురం, లింగసముద్రం, తిప్పిరెడ్డిపల్లి, ఊటుకూరు, అనంతమడుగు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. కైవల్యా నది నదీ పరివాహక ప్రాంతాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. సుమారు 700 ఎకరాల్లో నిమ్మచెట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సుమారు రూ.4 కోట్లు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు చెప్పారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



కాదలూరులో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: భారీ వర్షాలకు మండలంలోని పంటపొలాలు నాలుగు రోజులుగా నీటిలోనే ఉన్నాయి. చేనిగుంట గ్రామం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో తడ సర్పంచ్ కె.ఆర్ముగం, మరికొంతమంది సర్పంచులు జనరేటర్ ద్వారా మోటార్లను ఆన్ చేసి నీటిని సరఫరా చేశారు. వెండ్లూరుపాడు వద్ద మంగళవారం వాగు దాటేందుకు ప్రయత్నించిన గుర్రాలమిట్టకు చెందిన వేనాటి చంద్రారెడ్డి(65) వరద నీటిలో కొట్టుకుపోయాడు. మృతదేహం ముళ్లపొదల్లో చిక్కుకుని బుధవారం కనిపించడంతో బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాదలూరు జలదిబ్బంధంలో చిక్కుకుంది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆయన బుధవారం కాదలూరు, వెండ్లూరుపాడు గ్రామాల్లో వరద బాధితులను పరామర్శించారు.



దొరవారిసత్రం : మీజూరు గ్రామ సమీపంలో రోడ్డుకు పడిన గండి



చిట్టమూరు : గండి పడడంతో వృథాగా పోతున్న నీరు



స్వర్ణముఖి నది వద్ద తగ్గిన వరదనీటి ప్రవాహం



చిల్లకూరు : పల్లెవాని దిబ్బలో రెస్క్యూ ఆపరేషన్ టీంకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో



చిల్లకూరు : తిప్పగుంటపాళెం వద్ద పొలాల్లోకి వచ్చిన వరద నీరు

వరద బాధితులకు చేయూత



సైదాపురం: సరుకులు అందజేస్తున్న రవికుమార్

సూళ్లూరుపేట : వరదల కారణంగా మూడు రోజులుగా సాయినగర్ ప్రాథమిక పాఠశాలలోని పునరావాస కేంద్రంలో వున్న 21 ఎస్టీ కుటుంబాలకు అధికారులు నిత్యావసర వస్తువులు అందజేశారు. వారు బుధవారం ఆర్డీవో ఆర్.చంద్రముని చేతుల మీదుగా ఒక్కొక్క కుటుంబానికి 2500లు నగదు, 25 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, కిలో పామాయిల్, కిలో ఉల్లిగడ్డలు, కిలో బంగాళా దుంపలు పంపిణీ చేశారు. తహసీల్దార్ కే.రవికుమార్, మునిసిపల్ కమిషనర్ ఎం.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: వరద బాధితులకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించడం గొప్ప విషయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మన్నారపు రవికుమార్ యాదవ్ కొనియాడారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక్కో వ్యక్తికి రూ.1000, ఇద్దరి కంటే ఎక్కువ ఉన్న కుటుంబానికి రూ.2500 చొప్పున 48 కుటుంబాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అలాగే 25 కేజీల బియ్యం, ఐదు రకాల నిత్యావసర సరుకులు ఇస్తున్నట్టు వివరించారు. టీడీ ప్రసాద్, ఆర్ఐ నారాయణ, వీఆర్వో రఘు పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

నాయుడుపేట టౌన్ : భారీ వర్షాలకు ముంపున గురైన లోతట్టు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా సహాయక చర్యలు చేస్తున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి బుధవారం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. జేసీబీతో చెట్లను తొలగించారు. వైస్ చైర్మన్లు రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, పలువురు కౌన్సిలర్లు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. విన్నమాల సప్లయి చానల్ ద్వారా ఇళ్లలోకి వస్తున్న స్వర్ణముఖి నది నీటిని బయటకు తరలించేలా చర్యలు చేపట్టారు. కటకం జయరామయ్య, బైనా మల్లికార్జున రెడ్డి, గంధవళ్లి సిద్దయ్య, కౌన్సిలర్లు దారా రవి, చిందేటి విజయమ్మ, రాయపు సరితా, తిరుమల శెట్టి మణి, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ అధికారులతో కలిసి బట్టివిడత కాలనీ, బీరదవాడ, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో సహాయక కార్యక్రమాలు చేపట్టారు. భోజనాలు అందజేశారు. ఎస్టీ కాలనీ వాసులకు దుప్పట్లు పంపిణీ శారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

పెళ్లకూరు: మండలంలోని దిగువచావలి గ్రామం వద్ద బుధవారం స్వర్ణముఖి నది ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీకాంత్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. విచారణలో అతను శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వంకరపల్లి హసన్‌వల్లీ(38)గా తేలింది. అతను రెండు రోజుల క్రితం హైదరాబాదు వెళ్లేందుకు స్వర్ణముఖి నది బ్రిడ్జి వద్ద తల్లితో కలిసి నడిచి వెళుతూ కాలు జారి నదిలో పడి కొట్టుకుపోయినట్టు గుర్తించారు.

కండలేరులో 12.882 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 12.882 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 4300 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చెంబేడు చెరువుకు పూజలు

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు చెరువు వద్ద బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం ఆధ్వర్యంలో రైతులు పూజలు చేశారు. భారీ వర్షాలకు చెరువులోకి నీరు చేరింది. ఈ క్రమంలో విపత్కర పరిస్థితులు చోటుచేసుకోకుండా వరుణదేవుడు శాంతించాలని ప్రత్యేక పూజలు చేశారు. రవిరెడ్డి, మునిరాజ, మునీంద్ర పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని వల్లివేడు క్రాస్ రోడ్డు సమీపంలో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్న సంచార జీవులకు బుధవారం అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వారం నుంచి కురుస్తున్న వర్షానికి సంచార జాతుల వారు జీవనోపాధిలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సుమారు 50 కుటుంబాలకు సహాయం చేసినట్టు తెలిపారు. నేతలు రవికుమార్, శ్రీనివాసులు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం



సూళ్లూరుపేట: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్ : బీఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తూ పాలన సాగిస్తున్నారని తెలిపారు. నాయకులు కాండ్ర నారాయణరెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, బట్టా గోపీయాదవ్, అశోక్‌రెడ్డి, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీడీవో ప్రసన్నకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ అల్లాబక్షు, సీనియర్ సహాయకులు సిరాజ్ ఉద్దీన్ ఖాద్రి, పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, ప్రభాకర్, దయాకర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంగనపల్లి రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోటలో..

కోట: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీడీవో భవాని, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ రామయ్య తదితరులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, నాయకులు మల్లికార్జున రెడ్డి, జయరామయ్య, సిద్దయ్య, చంద్రారెడ్డి, ఎన్‌సీఆర్, రవి, వెంకటేశ్వర్లు, భాను, రాహుల్, రత్నశ్రీ, కన్యణి పాల్గొన్నారు.



గూడూరు రూరల్: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

వెంకటగిరి రూరల్ : బీఆర్ అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని మున్సిపల్ చైర్ పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కాంపాళెం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతుశారద, విబ్ పూజారి లక్ష్మీ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

గూడూరు రూరల్ : విద్యుత్ సరఫరా లేనికారణంగా కండలేరు డ్యామ్, వేములపాళెం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచి నీటి సరఫరా ఆగిపోయిందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నీరు అవసరమైన వారు 8555879672, 7032835010, 8919234680లో సంప్రదించాలని సూచించారు.

వలస కూలీలకు భోజన వసతి

గూడూరు రూరల్ : కూలి పనులు చేసుకునేందుకు వచ్చి వరదల్లో చిక్కుకుపోయిన కూలీలకు కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు భోజన వసతి కల్పించారు. బయట ప్రాంతాల నుంచి 30 కుటుంబాల వారు కందలి సమీపంలో పొలాల్లో టెంట్లు వేసుకుని పనులు చేస్తున్నారు. భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిలవడంతో ఎటూ పోలేని స్థితిలో ఉండిపోయారు. వారిని సర్పంచ్ వెంకటేశ్వర్లు బయటకు తీసుకువచ్చి పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేసి భోజన వసతి కల్పిస్తున్నారు.



యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

గూడూరు రూరల్ : గూడూరు డివిజన్‌లో విద్యుత్ సరఫరాకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నట్టు జేసీ డీకే బాలాజీ తెలిపారు. ఆయన బుధవారం గోగినేనిపురం వద్ద ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, డివిజన్‌లోని అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అన్ని చోట్లా విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు ఇతర జిల్లాల నుంచి సిబ్బందిని రప్పిస్తున్నట్టు చెప్పారు. జనరేటర్లతో ట్యాంకులను నింపి నీటిని సరఫరా చేస్తామన్నారు. బాధితులకు రెండు రోజుల్లోగా నిత్యావసర సరుకులు అందిస్తామని తెలిపారు. విద్యుత్‌శాఖ ఈఈ ఇస్మాయిల్, తహసీల్దార్ లీలారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సక్రమంగా సరుకుల పంపిణీ

చిల్లకూరు : గ్రామాలకు నిత్యావసర సరుకులను సక్రమంగా చేపట్టాలని జేసీ బాలాజీ ఆదేశించారు. ఆయన బుధవారం ముత్యాలపాడు సమీపంలో ఉన్న సివిల్ సప్లయిస్ గోదామును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో నెల మొదట్లోనే బియ్యం సరఫరా చేయాల్సి ఉందన్నారు. వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాలకు తరలించలేదన్నారు. ఆయా ప్రాంతాలకు వెంటనే పంపించాలని అధికారులను ఆదేశించారు.

బహిరంగ ప్రకటన

[illegible]

SCHEDULE: SPSR Nellore District. Gudur Regn. District Venkatagiri Sub-District Venktagiri Municipality Limits Cheviireddypalle Village Revenue Patta No.117 Sy.No.64/9. House Plot ais in an extent of Ac.0.33 cents Southern side of near house Bearning D.No 11-430 RCC House built in Plot No.1 measuring East to West 62.4 ft, North to South:34 Ft Admeasuring 2121.6 sq.ft or 235.73 sq.yds bounded on East: road, West: Site Belongs to P.Rajeswari and others, North: Road(D.No.11-430) South : Plot No.2

ఎ.సుదర్శనబాబు, [illegible]

సెల్: 9849509168, 0877-2234272

ప్రదేశం: తిరుపతి
తేది: 06.12.2023